సాక్షి
మహబూబాబాద్
గురువారం | 17 | ఏప్రిల్ | 2025



కొనేముందు తెలుసుకోండి..!
బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేముందు పలు జాగ్రత్తలు పాటిస్తే అసలు బంగారం, దాని నాణ్యతను సులువుగా గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చని పలువురు అంటున్నారు. - 8లో▸



ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి
ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39⁰ /24⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ వర్తింపజేయాలి



మహబూబాబాద్ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్లు)గా పనిచేస్తున్న తమకు పే స్కేల్ వర్తింపజేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల ఉప్పలయ్య (గాంధీ) కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని మహబూబాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఘుపతిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4,779 సర్క్యులర్‌ను రద్దు చేసి, లిస్ట్ మూడు కింద ఉద్యోగాలు కోల్పోయిన వారిని మళ్లీ ఉద్యోగాలకు తీసుకోవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.35 వేలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్ కార్డులు, జీవిత బీమా కల్పించాలని కోరారు. ఉద్యోగ సమయంలో మరణించిన వారికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, శ్వేత, సుజాత, ఉమారాణి, స్వాతి, విమల, ఉపేందర్, సుధాకర్, శ్రీలత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


50 ఆకుల కట్ట రూ.3.30

- తునికాకు ధరల నిర్ణయం

కొత్తగూడ: తునికాకు సేకరణ ధరలను ప్రజా సంఘాలు, కాంట్రాక్టర్లు మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో బుధవారం చర్చించి ధరలు నిర్ణయించారు. 50 ఆకుల కట్టకు రూ.3.30 నిర్ణయించారు. గతంలో రూ.3 ఉండగా అదనంగా 30 పైసలు పెంచుతూ ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ ధరలకు కాంట్రాక్టర్లు సమ్మతించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్క యాదగిరి, సందీప్, సారయ్య, న్యూడెమోక్రసీ నాయకులు పుల్లన్న, శ్రీశైలం, మంగన్న, బూర్క బుచ్చిరాములు, యాదగిరి, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపడతాం

- మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్



సాక్షి స్పందన

దోర్నకల్: సిగ్నల్‌తండాలోని తాగునీటి బావిలో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపడతామని మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండాలో తాగునీటి ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన కమిషనర్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్‌తో కలిసి బుధవారం సిగ్నల్‌తండా బావిని పరిశీలించారు. ఈ సందనకభంగా కమిషనర్ మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులతో బావిలో పూడికతీత పనులు చేపట్టి తండాకు తాగునీటి సరఫరా చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్: గత వీసీ హయాంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామని, రాబోయే నూతనకమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామని కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు ఎల్.యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం సంఘం సర్వసభ్యసమావేశంలో వారు మాట్లాడారు. మూడేళ్లలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేసిన వాటిని వివరించారు. కొత్త కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఈ నెల 21 తరువాత ఎన్నికలు జరపాలని ప్రస్తుత కమిటీ కోరనున్నది. ఆ తరువాత ఎన్నికైన నూతనకమిటీ ఇక నుంచి మూడేళ్లపాటు కొనసాగబోతుంది. సమావేశంలో ఉపాధ్యక్షుడు యూనస్, జాయింట్ సెక్రటరీలు తోట ప్రభాకర్, ఎ.సతీష్ బాబు, అరుణకుమారి, కోశాధికారి జి.నిరంజన్ బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.


జెన్‌పాక్ట్ నియామకాల్లో 'పింగిళి' విద్యార్థినుల సత్తా

హన్మకొండ అర్బన్: ప్రముఖ కార్పొరేట్ సంస్థ జెన్‌పాక్ట్‌లో వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు17 మంది ఉద్యోగాలు సాధించి సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు బుధవారం కళాశాల ఆవరణలో నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు తీసిపోకుండా ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు.

ఏ ఫర్..

అంగన్‌వాడీల్లో ఆంగ్ల విద్య

- ప్రీ ప్రైమరీ బోధనకు సిద్ధం
- ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని కేంద్రాలపై దృష్టి
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం
- అంగన్‌వాడీ టీచర్‌తో పాటు మరొకరిని నియమించే అవకాశం



జిల్లాలో అంగన్‌వాడీల వివరాలు

ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నవి : 713
పక్కా భవనాలు, రెంటెండ్ భవనాల్లో కొనసాగుతున్నవి : 724
మొత్తం : 1,437

సాక్షి, మహబూబాబాద్:

పుట్టిన బిడ్డ నుంచి చదువులు పూర్తయ్యే వరకు ప్రభుత్వమే మొత్తం బాధ్యత తీసుకొని మంచి బోధన అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడంతో అటు పౌష్టికాహారం, ఇటు ఉత్తమ బోధనకు పునాది వేసినట్లు అవుతుందని భావిస్తున్నారు.

జూన్ నుంచి విద్యాబోధన..

అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఒకేసారి మార్చడం ఇబ్బందిగా ఉంటుందనే ఆలోచనతో ముందుగా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించారు. జిల్లాలో డోర్నకల్, గూడూరు, మరిపెడ, మహబూబాబాద్, తొర్రూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,437 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 724 కేంద్రాలు పక్కా భవనాలు, రెంటెండ్ భవనాల్లో ఉండగా.. మిగిలిన 713 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఉన్న భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో ముందుగా 30 కేంద్రాలను ఎంపిక చేసి వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలు, అంగన్‌వాడీ టీచర్ల విద్యార్హతలు మొదలైన వివరాలను రాష్ట్ర అధికారులు తెప్పించుకున్నారు.

కిడ్స్ స్కూల్స్ తరహాలో..

ప్రభుత్వ నిబంధనల మేరకు 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ఉంది. అయితే ఐదు సంవత్సరాల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. కానీ ఆ తర్వాత పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ఉంచడం లేదు. ఇందుకోసం పట్టణాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలసిన కిడ్స్, వండర్ వర్ల్స్, కిండర్ గార్డెన్, మాంటిసోరీ, బచ్‌పన్ మొదలైన పేర్లతో లక్షల రూపాయల ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. అక్కడ ఆంగ్ల మాధ్యమం బోధన చేయడంతో పేదలు కూడా ఎక్కువ డబ్బులు ఖర్చుపెట్టి ఆయా స్కూల్స్‌కు పంపుతున్నారు. అదే ఒరవడిలో చదవడం, ప్రైవేట్ పాఠశాలపై మొగ్గు చూపుతున్నారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు ఆటలు, పాటలు, అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు అర్హులను చేయడం అంటే.. అక్షరాలు, అంకెలు, రైమ్స్ వంటి నేర్పించడం, నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో అంగన్‌వాడీ టీచర్లల్లో ఆందోళన మొదలైంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డైట్, బీఈడీ వంటి అర్హతలు ఉన్న వారిని వలంటీర్లుగా నియమిస్తారని ప్రకటనలు వస్తున్నాయి. అయితే సెంటర్‌కు మరొక టీచర్ వస్తే తమ ప్రాభల్యం తగ్గుతుందని కొందరు దశలవారీగా అంగన్‌వాడీ కేంద్రాలు ఎత్తి వేస్తారని మరికొందరు చెప్పడంతో అంగన్‌వాడీ టీచర్లలో భయం పట్టుకుంది. దీనిపై ఇప్పటికే అంగన్‌వాడీ ఉద్యోగుల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి, ఉన్నతాధికారులకు వినతి పత్రం కూడా అందచేశారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ బోధన జరిపిస్తే.. ఇంగ్లిష్ మీడియం కోసం ప్రైవేట్ పాఠశాలలకు పంపించాలనే తల్లిదండ్రుల ఆలోచన మారుతుంది. ఉచితంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరే అవకాశం ఉంటుంది.
- రవీందర్ రెడ్డి, డీఈఓ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ బోధన ప్రవేశపెడుతారనే ప్రచారం జరుగుతుంది. అయితే ఎప్పటిలాగానే రాష్ట్ర ఉన్నతాధికారులు నివేదికలు అడుగుతున్నారు. వారి ఆదేశాల మేరకు నివేదికలు అందజేస్తున్నాం. ప్రీ ప్రైమరీ సెంటర్ల ఎంపికకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.
- ధనమ్మ, డీడబ్ల్యూఓ, మహబూబాబాద్

సెలవులు ఇవ్వకముందే ఇంటిబాట

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు

మహబూబాబాద్ అర్బన్: వేసవి సెలవులు ఇవ్వకముందే కొంతమంది హాస్టల్ వార్డెన్లు విద్యార్థులను ఇంటికి పంపుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల, వివిధ గురుకుల పాఠశాలలో 1 నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వార్షిక పరీక్షలు ముగిశాయని గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు పరీక్షలు ముగిసిన తర్వాత ఈ నెల 23వ తేదీ వరకు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రొగ్రెస్ కార్డులు అందజేసి పంపించాలి. కానీ ముత్యాలమ్మగూడెం, మానుకోట జిల్లా కేంద్రంలోని ఆర్డీ కార్యాలయం ఎదురుగా ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హాస్టల్స్ ప్రభుత్వ నింబంధనలు పాటించకుండా వార్డెన్లు విద్యార్థులను సెలవులు వచ్చాయని ఇంటికి వెళ్లిపోవాలని సెలవు పత్రాలు రాయించుకుని పంపిస్తున్నారు. కొంత మంది వార్డెన్లు విద్యార్థుల బారం మోయలేమని, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, వార్డెన్లు మీ పిల్లలను ఇంటికి తీసుకెళ్లాలని ఫోన్లు చేస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైన హాస్టల్స్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిబంధనలను పాటించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. దీనిపై గిరిజన శాఖ అధికారిని వివరణ కోరగా విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి అనుమతి లేదని, ప్రభుత్వం సెలవులు మంజూరు చేసినప్పుడే తల్లిదండ్రులతో ఇంటికి పంపాలన్నారు. లేదంటే వార్డెన్లపై చర్యలు తీసుకుంటామన్నారు.



ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హాస్టల్ నుంచి లగేజీతో ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెర్లపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు బాకి శ్రీనివాస్, నాగరాజు, నాగిరెడ్డి, యాకుబ్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీరెల్లి లావణ్య, రామచంద్రు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహాముత్తారం అడవిలో పులి కలకలం

కాటారం: మహాముత్తారం మండలంలో పులి సంచారం కలకలం సృష్టిస్తుంది. పులి అటవీ ప్రాంతంలోకి వచ్చిందనే పుకార్లతో అటవీ సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా స్తంభంపల్లి(పీకే), మద్దిమడుగు గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో పులి అడుగులను అటువైపు వెళ్లిన పలువురు గుర్తించారు. సమాచారం అందుకున్న దూదేకులపల్లి రేంజర్ రాంమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పులి పాదముద్రలను నిర్ధారించారు. కానీ, అవి తాజా పాదముద్రలు కావని.. నాలుగురోజుల క్రితం పులి ఇటువైపుగా వెళ్లినట్లుగా ఉన్నాయని రేంజర్ తెలిపా రు. ఏదేమైనప్పటికీ పులి అటవీ ప్రాంతంలోనే ఉంటుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రక్త పరీక్షల ఫలితాలు త్వరగా అందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్

నెహ్రూసెంటర్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన రక్త నమూనాలను త్వరగా పరీక్షించి ఫలితాలను వెంటనే పంపించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో టీహబ్, పాలియేటివ్ కేర్, టీబీ ప్రోగ్రాం, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్స్, ఎయిడ్స్ కార్యక్రమాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులను పరీక్షించి రక్త నమూనాలను సేకరించి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. క్షయ వ్యాధికి సంబంధించిన సిబి నాట్ టెస్టులు, ట్రూ నాట్ టెస్టులు జరుగుతున్నాయని దీనిపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, జ్యోతిరెడ్డి, మేనేజర్ అనురాధ, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

ఉత్తమ వైద్యసేవలే లక్ష్యం

గూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్ అన్నారు. మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీతో పాటు భూపతిపేట వ్యాక్సినేషన్ సెంటర్‌లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులు పరిశీలించి, అన్ని జాతీయ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యమున, హెచ్ఈఓ లోక్యానాయక్, గణేష్, సర్దార్‌బాబు, విశాల, స్రవంతి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

- మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్

మహబూబాబాద్ అర్బన్: వక్ఫ్ బిల్లు రద్దుపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం రచించిన ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు సమాన స్వేచ్ఛ హక్కులు కల్పించారని, మైనార్టీలకు కూడా బీజేపీ ప్రభుత్వం అన్ని సమాన హక్కులు కల్పిస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం 106 సార్లు సవరణ జరిగిందని, 1954, 1955, 2013లో వక్ఫ్ బోర్డు బిల్లు కాంగ్రెస్ ప్రభుత్వామే సవరించిందని గుర్తు చేశారు. ప్రతి పేద ముస్లిం, మైనార్టీ ప్రజలకు న్యాయం జరగడానికే ప్రధాన మంత్రి వక్ఫ్ బోర్డు బిల్లు సవరించడం జరిగిందని, నేడు ఈ సవరణ బిల్లు సుప్రీంకోర్టులో ఉందని, దీనిపై విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నాయకులకు సరికాదన్నారు. బీజేపీ ఎప్పుడు ముస్లింకు వ్యతిరేకంగా కాదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మొసంగి మురళీ, చీకటి మహేష్‌గౌడ్, శ్యాంసుందర్‌శర్మ, నాయకులు గద్దం అశోక్, తుంపిళ్ళ శ్రీనివాస్, దార ఇందుభారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్

విద్యార్థుల నమోదు శాతం పెరగాలి

- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: నూతన విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ సాధారణ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ దేశీరాంనాయక్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో విద్యా వ్యవస్థ పనితీరు, వసతి గృహాల విధివిధానాల కార్యాచరణపై పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి విషయంలో ప్రత్యేక చొరవ చూపి నూతన విధివిధానాలకు అనుగుణంగా పనితీరును మెరుగు పరచుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో పాఠశాలలన్నింటికి రంగులు, మరమ్మతులు పూర్తి చేసి ఆకర్షణీయంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ దేశీరాంనాయక్

అకాల వర్షం..తీరని నష్టం





కేసముద్రం: మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని దగ్గరికి చేరుస్తున్న రైతులు, మహబూబాబాద్ రూరల్: తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు బానోత్ సేవ్యా

జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం

- నేలరాలిన మామిడికాయలు
- కేసముద్రం మార్కెట్‌లో తడిసిన ధాన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మొక్కజొన్న, వరి, మామిడిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. అకస్మాత్తుగా వచ్చిన గాలిదుమారం, ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షపు నీరు రాశుల్లోకి చేరి ధాన్యం తడిసి రైతులు మనోవేదనకు గురవుతున్నారు. అలాగే బయ్యారం, దంతాలపల్లి, నర్సింహులపేట, తదితర మండలాల్లో మోస్తారు వర్షం కురిసింది. పలు చోట్ల ఇంటిపై కప్పులు లేచిపడ్డాయి. ప్రభుత్వం స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు.



దంతాలపల్లి: నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న శాంతిప్రియదర్శిని

ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం.. : ఉద్యానవన శాఖ అధికారి శాంతిప్రియదర్శిని

దంతాలపల్లి: అకాల వర్షాలతో దెబ్బతిన్న మామిడి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి నష్టం తీవ్రతను ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శాంతిప్రియదర్శిని అన్నారు. బుధవారం మండలంలోని రేపోణి, వేములపల్లి, రామానుజపురం, పెద్ద ముప్పారం, రామవరం గ్రామాల్లో పర్యటించి మామిడితోటలను పరిశీలించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కేసముద్రం మార్కెట్‌లో తడిసిన మక్కలు

- మరిన్ని ఫొటోలు 9లో▸

యోగా కౌన్సెలర్ల నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సురేష్‌లాల్ తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్యాకేంద్రంలో డిప్లొమా ఇన్ యోగా కోర్సు బోధనకు బుధవారం కౌన్సెలర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దూర విద్యాకేంద్రం డైరెక్టర్ బి.సురేష్‌లాల్, విద్యావిభాగం డీన్ ఎస్.రాంనాథ్‌కిషన్, బీఓఎస్, వరంగల్ నిట్ ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. 9మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరితో ఈ రెండు బ్యాచ్‌లకు యోగా థియరీ ,ప్రాక్టికల్స్ క్లాస్‌లు నిర్వహించాలని యోచిస్తునట్లు డైరెక్టర్ సురేష్‌లాల్ తెలిపారు.

కాళేశ్వరం ఆర్చి నిర్మాణ పనులు ప్రారంభం

2018లో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తొలగింపు



మహదేవపూర్ జాతీయరహదారిపై ఆర్చి పనులు చేపట్టిన సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో కాళేశ్వరం దేవస్థానానికి సంబంధించిన ఆర్చి నిర్మాణ పనులు ఎన్‌హెచ్ 353(సీ)ప్రధాన రహదారి పైన బుధవారం ప్రారంభమయ్యాయి. 2018లో కాళేశ్వరం ప్రాజెక్టునిర్మాణ సమయంలో భారీ యంత్రాలు, పరికరాలు, మోటార్లు ఆర్చి కింద నుంచి వెళ్లేందుకు వీలుగా లేకపోవడంతో మేఘా ఇన్‌ఫ్రా సంస్థ కూల్చివేసింది. నిర్మాణానికి నష్టపరిహారంగా రూ.25లక్షలు దేవస్థానానికి సదరు సంస్థ చెల్లించింది. అప్పటి నుంచి ఆర్చి నిర్మాణాలపై దేవాదాయ శాఖ దృష్టిసారించలేదు. ఈక్రమంలో మే 15వ తేదీ నుంచి 26 వరకు జరిగే సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఆర్చి పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఆదేశించడంతో ఈఓ మహేష్ పనులు ప్రారంభించారు. పిల్లర్లకోసం జేసీబీతో తవ్వకాల చేపట్టారు. కాగా, రూ. 32 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు.



ఆర్చి నిర్మాణ నమూనా చిత్రం

క్లుప్తంగా

రూ. 5.60 లక్షల విలువైన ఎండు గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి అర్బన్: గణపురం మండలం రవినగర్ సమీపంలో రూ. 5.60లక్షల విలువైన 11 కేజీల ఎండు గంజాయి పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం భూపాలపల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి మండలం గుర్రంపేటకు చెందిన ఆరెల్లి అఖిల్, గణపురం మండలం చెల్పూరుకు చెందిన ఆముదాల కార్తీక్, హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్‌కు చెందిన ముస్కె రోహిత్ స్నేహితులు. తాము సంపాదించే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో కొద్ది రోజులుగా ఒడిశాలోని కొండప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి భూపాలపల్లి, గణపురం మండలాల పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న రవినగర్ సమీపంలో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు అశోక్ తన సిబ్బందితో కలిసి మంగలోనికుంట మత్తడి వద్ద మాటు వేయగా ముగ్గురు వ్యక్తులు సంచులు పట్టుకుని అనుమానాస్పందగా కనిపించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి రవాణా చేస్తున్నట్లు అంగీకరించడంతో సరుకు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. కాగా, గంజాయిని పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వర్తించిన చిట్యాల సీఐ మల్లేశ్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్, సీసీఎస్ ఎస్సై భాస్కర్‌రావు, సిబ్బందిని అభినందించారు.

వడదెబ్బతో మహిళ మృతి



వసంత(ఫైల్)

నర్సంపేట రూరల్ : వడదెబ్బతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు గార్లగడ్డతండాలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ఫాల్తియా వసంత (35) మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి పజ్జజొన్న చేనులో పని చేసి సాయంత్రం ఇంటికి వచ్చింది. అదేరోజు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. మృతురాలికి భర్త భద్రు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలునుంచి జారి పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ వద్ద ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌కు చెందిన పెరుమాండ్ల అనిల్ (29) మంగళవారం రామగుండంలో కూలి పనికి వెళ్లి తిరిగి రైలులో సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో రైలు వరంగల్ రైల్వే గేట్ సమీపాన చేరుకోగానే అనిల్ అందులోనుంచి జారిపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోలో ఎంజీఎం తరలించగా.. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

కొనేముందు తెలుసుకోండి..!



సాక్షి మీ కోసం

పసిడి నాణ్యతను గుర్తించండిలా..

- హాల్‌మార్క్‌తోనే మోసాలకు చెక్
- యూనిక్ ఐడీ నంబర్‌ను బట్టి స్వచ్ఛత
- నాణ్యత శాతం సర్టిఫికెట్‌తోనే అసలు గుర్తింపు

ఖిలా వరంగల్: బంగారం ఆభరణాలంటే ఇష్టపడని వారుండరు. ముఖ్యంగా మహిళలు మక్కువ చూపుతారు. హుందాకు చిహ్నంగా భావిస్తారు. అందుకే పెళ్లిళ్లు, శుభకార్యాలయాల్లో బంగారు ఆభరణాలదే అగ్రస్థానం. ధర ఎంత పెరిగినా.. పసిడిని కొనుగోలు చేయడం మానరు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం సంప్రదాయ అవసరాలు తీర్చడమే కాకుండా పెట్టుబడులకు కూడా ఉపయోగపడుతోంది. అందుకే చాలా మంది భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా బంగారం విక్రయాలు పెరుగుతున్నాయి. అదే స్థాయిలో షాపులు కూడా పెరుగుతున్నాయి. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, ఏటూరునాగరం, నర్సంపేట, పరకాల, తొర్రూరు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యల్లో బంగారు ఆభరణాల షాపులు ఉన్నాయి. కొనుగోలు సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అసలు బంగారం, దాని నాణ్యతను సులువుగా గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చు. వరంగల్ ట్రైసిటీలో చిన్న, పెద్ద కలిపి సుమారు 150పైగా దుకాణాలు ఉన్నాయి. అనధికారికంగా మరికొన్ని వెలుస్తున్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.95 వేలకుపైగా చేరింది. ఈ క్రమంలో కొనుగోలు సమయంలో వినియోగదారులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

బంగారంలోనే రంగులు

బంగారు ఆభరణం తయారీలో నికిల్, మాంగనీస్ లేదా పల్లాడియం వంటి లోహాలు కలుపుతారు. అప్పుడు అది బంగారం వర్ణంలోనే కొంచెం తెల్లని ఛాయలో ఉంటుంది. రాగి ఎక్కువ కలిపితే ఎరుపు, గులాబీ ఛాయలో కనిపిస్తుంది. రోజ్‌గోల్డ్ అయితే అందులో 25 శాతం రాగి కలిపినట్లు అర్థం చేసుకోవచ్చు. అప్పుడు ఆ బంగారంతో 18 క్యారెట్లు మాత్రమే ఉంటుంది. వెండి, మాంగనీస్, రాగిని ఉపయోగిస్తే బూడిద రంగు ఛాయలో ఉంటుంది. కేవలం వెండిని మాత్రమే కలిపితే గ్రీనిస్ షేడ్‌లో కనిపిస్తుంది.

స్వచ్ఛత గుర్తింపు ఇలా..

ఆభరణం అంచులు రంగు పోయి బంగారపు వర్ణం కాకుండా ఇతర వర్ణం కనిపిస్తుంటే అది కచ్చితంగా పూత పోసిన ఆభరణమని గ్రహించాలి. నోటి పళ్ల మధ్య పెట్టి బలంతో ఆభరణాన్ని నొక్కి చూడండి. స్వచ్ఛ బంగారమా.. పూత పోసిందా అని తెలుసుకోవచ్చు. పంటి గాట్లను గమనించి బంగారం నాణ్యతను సులభంగా తెలుసుకోవచ్చు. బంగారంలో ఇనుము కలిసి ఉంటే అయస్కాంతంతో గుర్తించొచ్చు. షైనింగ్ లేని సిరామిక్ ప్లేట్ మీద బంగారు ఆభరణాన్ని రుద్దితే నల్లని చారలు పడితే అది స్వచ్ఛమైనది కాదు. బంగారు గీతలు పడితే స్వచ్ఛమైనది అని అర్థం. ఆభరణం కొనుగోలుకు ముందే షాపు వద్ద నైట్రిక్ యాసిడ్‌తో టెస్ట్ చేయమని కోరవచ్చు. ఆభరణంపై చుక్క నైట్రిక్ యాసిడ్ వేసిన వెంటనే రసాయనిక చర్య ప్రారంభమై ఆకుపచ్చ రంగులో కనిపిస్తే బేస్ మెటల్ లేదా బంగారు పూత వేసిందిగా గ్రహించాలి. బంగారం వర్ణంలోనే రియాక్షన్ కనిపిస్తే బంగారం పూత వేసి ఇత్తడిగా గమనించాలి. పాల రంగులో కనిపిస్తే వెండి ఆభరణంగా ఎలాంటి రియాక్షన్ లేకపోతే దానిని స్వచ్ఛమైన ఆభరణంగా గుర్తించాలి.

కేడీఎం అంటే..

జ్యువెల్లరీ దుకాణంలో బంగారం కొనే సమయంలో ఆ ఆభరణం కేడీఎం అని షాపు యజమానులు చెబుతారు. అసలు కేడీఎం అంటే బంగారు ఆభరణాలు తయారీలో కాడ్మియంతో సోల్డరింగ్ చేస్తారు. ఇవి 91.6 స్వచ్ఛతతో ఉంటాయి.

ఇవి గమనించాలి..

24 క్యారెట్ల బంగారంలో 99.9, 22 క్యారెట్ బంగారంలో 91.6 శాతం స్వచ్ఛత ఉంటుంది. స్వచ్ఛ బంగారం మెత్తగా ఉంటుంది. బంగారంలో కలిపిన ఇతర లోహాల శాతాన్ని బట్టి ఆభరణాల రంగు, గట్టిదనం, మన్నిక ఆధారపడి ఉంటాయి. నాణ్యత తెలిపే కొలమానం వేయించుకుని రశీదులు తీసుకోవాలి. భవిష్యత్‌లో తేడా వస్తే కేసు వేయడానికి అవకాశం ఉంటుంది.



24 క్యారెట్లు అంటే..

బంగారం స్వచ్ఛతను క్యారెట్ల రూపంలో కొలుస్తారు. 99.9 శాతం స్వచ్ఛత ఉన్న బంగారాన్ని 24 క్యారెట్ల బంగారం అంటారు. దీనితో ఆభరణాలు చేయరు. ఇది బిస్కెట్ రూపంలోనే ఉంటుంది. ఆభరణాలు గట్టిగా , మన్నికగా ఉండేందుకు గాను స్వచ్ఛమైన బంగారానికి రాగి, వెండి, కాడ్మియం, జింక్ వంటి ఇతర లోహాలు కలుపుతారు. ఇలా చేయడం ద్వారా బంగారం స్వచ్ఛత 22.18.14 క్యారెట్లుగా నిర్ధారిస్తారు.

క్యారెట్ల బట్టి స్వచ్ఛత..

- 24 క్యారెట్లు: 99.9 శాతం స్వచ్ఛత ఇది. బిస్కెట్ రూపంలో ఉంటుంది.
- 22 క్యారెట్లు: 91.6 శాతం బంగారం, మిగతా 8.4 శాతం ఇతర లోహాలు కలుస్తాయి.
- 18 క్యారెట్లు: 75 శాతం బంగారం, మిగతా 25శాతం ఇతర లోహాలు
- 14 క్యారెట్లు: 58.5 శాతం బంగారం, మిగతా భాగం ఇతర లోహాలు
- 12 క్యారెట్లు: 50శాతం మాత్రమే బంగారం, మిగతా 50శాతం ఇతర లోహాలు మిశ్రమంతో తయారీ అవుతుంది.
- 10 క్యారెట్లు: 41.7 శాతం బంగారం మాత్రమే ఉంటుంది.

హాల్‌మార్క్ సర్టిఫికెట్‌తో కొనుగోలు చేయాలి




బంగారు ఆభరణాల కొనుగోలులో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. భారీగా పెరుగుతున్న బంగారం ధరలు వ్యాపారులకు వరంగా, వినియోగదారులకు భారంగా మారాయి. రెడీమేడ్ బంగారం, వెండి ఆభరణాల్లో 60 నుంచి 70శాతం నష్టాన్ని కలిగిస్తాయి. నాణ్యతాప్రమాణాల గుర్తింపు కోసం హాల్‌మార్క్ ముద్ర, నాణ్యత శాతాన్ని సూచించే నంబర్‌తో కూడిన వస్తువునే కొనుగోలు చేయాలి. వస్తువు నాణ్యత లేనిపక్షంలో బీఐఎస్‌కు ఆన్‌లైన్‌లో లేదా వినియోగదారుల సంఘాల ప్రతినిధికి ఫిర్యాదు చేయాలి

-మొగిలిచెర్ల సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షుడు, సీసీఐ

హాల్‌మార్క్ సర్టిఫికెట్‌తో పసిడి నాణ్యత..

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్ హాల్‌మార్క్ సర్టిఫికేషన్ విధానం ప్రవేశ పెట్టింది. తయారైన ఆభరణం చిన్నదైనా,పెద్దదైనా హాల్‌మార్క్ ముద్ర, నాణ్యత శాతాన్ని సూచించే నంబర్‌తో పాటు ఆ వస్తువు సర్టిఫై చేసిన హాల్‌మార్క్ సెంటర్ వివరాలు తెలిపే హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ యూనిక్ ఐడీ నంబర్ విధిగా ఉండాలి. ఈ అన్ని వివరాలను కొనుగోలు రశీదులో పొందుపర్చి వినియోగదారుడికి అందించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు ఇవేవి చేయకపోగా అన్ని ఆభరణాలు 91.6 అని విక్రయిస్తున్నారు. దీనికి రశీదులు ఇవ్వకుండా.. ఇచ్చినా అందులో వివరాలు తెలుపడం లేదు. దీనిపై వినియోగదారులు చైతన్యవంతులై నిలదీయాలి.



నెల రోజుల్లో 'కిటెక్స్' ప్రారంభం

- కంపెనీ మేనేజర్ మనోజ్
- పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరించిన మేనేజర్



కిటెక్స్ కంపెనీ మేనేజర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లోని కేరళ కేంద్రంగా ఉన్న 'కిటెక్స్' కంపెనీని నెల రోజుల్లో ప్రారంభిస్తామని మేనేజర్ మనోజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సత్యశారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కంపెనీ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ మనోజ్.. కలెక్టర్, ఎమ్మెల్యేకు కంపెనీలో తయారు చేసే గార్మెంట్లు, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరుగుతోందని, వచ్చే నెలలో ప్రధాని మోదీతో కంపెనీని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, కంపెనీలో ఇప్పటికే పలు కేటగిరీలకు చెందిన ఉద్యోగుల భర్తీ ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో కొనసాగుతోంది. కంపెనీ ఇప్పటికే 25,000 ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ప్రతి రోజూ నిరుద్యోగులు కంపెనీ వద్దకు దరఖాస్తులతో క్యూ కడుతున్నారు. టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, గీసుకొండ తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

20న హజ్ యాత్రికులకు శిక్షణ

న్యూశాయంపేట : పవిత్ర మక్కాలోని హజ్ యాత్రకు వెళ్లే ఉమ్మడి వరంగల్ జిల్లా యాత్రికులకు ఈనెల 20 ఆదివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు సర్వర్‌మోహియొద్దీన్ ఘాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ఏ1 ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. యాత్రికులకు ప్రొజెక్టర్ ద్వారా సవివరంగా యాత్ర ఎలా చేయాలనే విషయాలపై శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రీకులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఒక్కడే..18 బైక్‌లు చోరీ

- రద్దీ ప్రాంతాలే లక్ష్యం..
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి: ఒకే యువకుడు వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన 18 బైక్‌లు చోరీ చేశాడు. వాహనాల తనిఖీల్లో తప్పించుకునే క్రమంలో పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని తీసుకుని విచారించగా ఈ విషయం బయటపడింది. ఇందుకు సంబంధించిన వివరాలను కాజీపేట ఏసీపీ తిరుమల్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం ఫతేపూర్‌కు చెందిన గుగులోత్ చందూలాల్ కొంతకాలంగా 56వ డివిజన్ గోపాలపురంలో ఉంటున్నాడు. తన స్నేహితుడి ఐడీతో జొమాటో, స్విగ్గి, ర్యాపిడో సంస్థల్లో పనిచేస్తున్నాడు.అయితే ఆ ఆదాయం సరిపడకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనకు వచ్చి రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను మాయం చేస్తున్నాడు. ఇందులో భాగంగా హనుమకొండ పీఎస్ పరిధిలో ఏడు, హసన్‌పర్తి పీఎస్ పరిధిలో మూడు, కేయూసీ పీఎస్ పరిధిలో ఒకటి, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పరిధిలో నాలుగు, భువనగిరిలో రెండు, హైదరాబాద్‌లో ఒకటిచొప్పున ఎత్తుకెళ్లాడు.

ఇంటిలోనే చోరీ వాహనాలు..

హసన్‌పర్తి మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసిన చందూలాల్ తప్పించుకునే క్రమంలో పట్టుకుని విచారించారు. చోరీ వాహనాలను ఫతేపూర్‌లోని తన ఇంటిలోనే భద్రపరిచినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో అతడి ఇంటికెళ్లి 18 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తిరుమల్ చెప్పారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ తిరుమల్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్, సిబ్బందిని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

బాలుడి కాలుపై వాత పెట్టిన ఆయా

మహబూబాబాద్: ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా స్టౌవ్‌పై కత్తిని వేడి చేసి బాలుడి కాలుపై వాత పెట్టింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీకి చెందిన పావని, వంశీ దంపతుల కుమారుడు మనుదీప్ (5 ఏళ్లు)ను స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. నాలుగు రోజుల క్రితం కేంద్రంలో పనిచేస్తున్న ఆయా భద్రమ్మ.. సదరు విద్యార్థి మనుదీప్ కుడి మోకాలు కింద భాగంలో వాత పెట్టింది. కూ రగాయలు కోసే కత్తిని స్టౌవ్‌పై వేడి చేసి వాతపెట్టడంతో పెద్ద గాయం కావడంతోపాటు జ్వరం వచ్చిందని తల్లి తెలిపింది. దీంతో బుధవారం అంగన్‌వాడీ కేంద్రం ఎదుట బాలుడి తల్లిదండ్రులతోపాటు బంధువులు ఆందోళన చేశారు. అంగన్‌వాడీ టీచర్ సరితతోపాటు ఆయా భద్రమ్మతో వాగ్వాదానికి దిగారు. టీచర్ సరిత, ఆయా భద్రమ్మను వివరణ కోరగా వాత పెట్టలేదని, వారి వ్యక్తిగత గొడవల మూలంగానే ఆందోళన చేశారని తెలిపారు.



వాతను చూపిస్తున్న బాలుడు మనుదీప్

విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : ఈదురుగాలులు, భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో 16 సర్కిళ్ల పరిధిలో ప్రతీ అధికారి, ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈదురుగాలులకు చెట్లు విరిగి లైన్లు తెగిపడి ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ జరిగిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తమ సర్కిల్ పరిధిలోని సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలని, అక్కడి నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు సమాచారం అందించాలన్నారు. కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉంచామని, ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఎక్కువ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, జగిత్యాల, పెద్దపల్లి ప్రాంతాల్లో ఎక్కువ ఈదురుగాలులు, భారీ వర్షాలు పడుతాయని, ఎస్ఈలు ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ, మెన్, మెటీరియల్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, అశోక్, 16 సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొన్నారు.

టెంట్‌సిటీ నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

- కలెక్టర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం



వీఐపీ ఘాట్ వద్ద విగ్రహాలు తొలగిస్తున్న అధికారులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీనది పుష్కరాల్లో టూరిజంశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన టెంట్‌సిటీ పనులు యుద్ధప్రాతిపాదికన చేట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు.. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మను ఆదేశించినట్లు తెలిసింది. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో జరిగిన సరస్వతీ పుష్కరాల యాప్, వెబ్‌పోర్టల్ ప్రారంభ సమీక్షలో కలెక్టర్‌తో మంత్రి మాట్లాడినట్లు తెలిసింది. కాళేశ్వరంలోని వీఐపీ(సరస్వతి) ఘాట్ వద్ద తాత్కాలిక టెంట్‌సిటీ నిర్మాణాలకు రూ.83లక్షలు కేటాయించిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. మేఘా, సింగరేణి, ఎన్‌టీపీసీల్లో ఏదో ఒక్క సంస్థకు అప్పగించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు సమాచారం. టెంట్‌సిటీ కోసం ఇప్పటికే కాళేశ్వరంలో దేవస్థానానికి సంబంధించిన గుడిమాన్యం భూమిలో ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రైతులకు కూడా పంటనష్టం అందజేశారు. కానీ నిర్మాణాలు మొదలు కాకపోవడంతో మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో షార్ట్‌టెండర్స్ పిలిచి పనులు చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు ఆలయ వర్గాల సమాచారం.

వీఐపీ ఘాట్ వద్ద విగ్రహాల తొలగింపు

కాళేశ్వరంలోని వీఐపీ(సరస్వతి)ఘాట్ వద్ద పుష్కరఘాట్ విస్తరణలో భాగంగా వేప, జమ్మి చెట్లు కలిసి ఉన్న చెట్టు కింద భక్తులు ఏర్పాటు చేసిన పలు దేవతా విగ్రహాలకు బుధవారం ఉద్వాసన పూజ చేసి తొలగించారు. కాగా, ఇటీవల కలెక్టర్ రాహుల్‌శర్మ సరస్వతీనది పుష్కరాల అభివృద్ధి పనులు పరిశీలించిన సమయంలో ఘాట్‌పై ఉన్న వేప, జమ్మి చెట్లు కలిసి ఉన్న చెట్టును తొలగించొద్దని, దేవతా విగ్రహాలను తొలగించి ప్రత్యేకంగా మళ్లీ ఓ చోట ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో తొలగింపు పనులు చేపట్టారు.

కాటాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య



దేవేందర్(ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కాటాపూర్‌లోని బెస్త గుంపులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. కాటాపూర్ బెస్త గుంపునకు చెందిన కంపెల్లి దేవేందర్ ((40)) నాలుగు సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15న కాటాపూర్ వచ్చాడు. అదే రోజున గ్రామంలో సర్కస్ నిర్వహిస్తుండగా చూడడానికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికొచ్చాడు. సుమారు 10 గంటల ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి కన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దేవేందర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు. కాగా, తన కుమారుడి ఆత్మహత్యకు రామెల్ల ప్రశాంత్, నర్సయ్య కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కన్నమ్మ కోరింది.

కక్కిరాలపల్లిలో మరో వ్యక్తి..



చందర్(ఫైల్)

ఐనవోలు: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కక్కిరాలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కత్తెరశాల చందర్(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండో భార్య శ్వేతతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీనిపై మనస్తాపానికి గురైన చందర్ బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, చందర్‌కు మొదట మమతతో వివాహం జరగగా ఇద్దరు కుమారులు రాజేశ్, రోహిత్ జన్మించారు. చందర్‌తో మొదటి భార్య, కుమారులు వేరుగా ఉండడంతో సుమారు 10 సంవత్సరాల క్రితమే శ్వేతను రెండో వివాహం చేసుకున్నాడు. చందర్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

వేసవిలో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను



డ్రైవర్లకు వాటర్ క్యాన్, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఆర్ఎం విజయభాను

హన్మకొండ: వేసవి కాలంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ డ్రైవర్లు విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని ఆర్టీసీ హనుమకొండ డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లకు వాటర్ క్యాన్లు, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ డ్రైవర్లు ఎండతోపాటు ఇంజన్ వేడి తట్టుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇలాంటి తరుణంలో తగినంత తాగు నీరు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎండ నుంచి ఉపశమనానికి రుమాలు చుట్టుకోవాలన్నారు. డ్యూటీలో అస్వస్థతకు గురవుతున్నట్లు కనిపించినా, డీ హైడ్రేషన్‌కు గురైనా వెంటనే ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడగాలులు, ఎండ వేడి నుంచి కొంతైనా ఉపశమనం పొందొచ్చన్నారు. ఈ క్రమంలోనే హనుమకొండ డిపోలోని ప్రతీ డ్రైవర్‌కు జ్యూట్ బ్యాగుతో కూడిన 5 లీటర్ల వాటర్ క్యాన్, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరమ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కేశరాజు భాను కిరణ్, మహేశ్, హనుమకొండ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మోసగించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు

ఎల్కతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను నమ్మించి మోసం చేయడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో సుమారు 1,200 ఎకరాల్లో ఈనెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్స సభ ఏర్పాట్లను ఆమె మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, నాయకులు నాగుర్ల వెంకన్న, భరత్‌కుమార్, రాకేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యవతి రాథోడ్ మాట్లాడారు. తప్పుడు ప్రచారం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చితకిల పడిపోయిందన్నారు. నాడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని చెప్పారు. సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సదానంద, పార్టీ మండల అధ్యక్షులు మహేందర్, మండల సురేందర్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ మహేందర్, గోల్లె మహేందర్, మాజీ సర్పంచ్‌లు కుర్ర సాంబమూర్తి, దుగ్యాని సమ్మయ్య, జూపాక జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.